క్లుప్తంగా

తైబజార్ ఆదాయం రూ.34లక్షలు

జగదేవ్‌పూర్(గజ్వేల్): మండల కేంద్రం జగదేవ్‌పూర్‌లో మంగళవారం తైబజారు వేలం పాట సర్పంచ్ లక్ష్మీశ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. పశువుల సంతకు వేలం పాట వేయగా ఆలేరుకు చెందిన నాగరాజు రూ.34లక్షలకు దక్కించుకున్నారు. కూరగాయల మార్కెట్‌కు అనుకున్న విధంగా వేలం పాట రాకపోవడంతో డీఎల్‌పీఓ ఆదేశాల మేరకు బుధవారానికి వాయిదా వేసినట్లు సర్పంచ్ తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శి హరిప్రసాద్, ఉపసర్పంచ్ మల్లేశం, కొండ పోచమ్మ డైరెక్టర్ కనకయ్య, వార్డుసభ్యులు పాల్గొన్నారు.

కూరగాయల వారసంత వేలం రూ.4.05లక్షలు

బెజ్జంకి(సిద్దిపేట): బెజ్జంకి మండల కేంద్రంలో ప్రతీ సోమవారం నిర్వహించే కూరగాయల వారసంతకు మంగళవారం జరిగిన తైబజార్ వేలం పాటలో రూ.4.05లక్షల ఆదాయం వచ్చినట్లు ఎంపీఓ విష్ణువర్ధన్ తెలిపారు. పశువుల సంతకు నిర్దేశిత వేలం పాట రాకపోవడంతో వాయిదా వేసినట్లు తెలిపారు. బుధవారం పశువుల సంతకు తిరిగి వేలం నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ ద్యావనపెల్లి మంజుల, కార్యదర్శి ప్రణీత్‌రెడ్డి, రమేశ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

చెరువు మరమ్మతు పనులు ప్రారంభం


పనులను ప్రారంభిస్తున్న ఎంపీపీ, సర్పంచ్

వర్గల్(గజ్వేల్): భారీ ఆయకట్టు కలిగిన మండలంలోని మజీద్‌పల్లి బోయినమ్మ చెరువు మరమ్మతులకు ప్రభుత్వం రూ.9.85లక్షల ఆపరేషన్ అండ్ మెయింటనెన్స్ నిధులు మంజూరు చేసింది. మంగళవారం ఎంపీపీ జాలిగామ లత, సర్పంచ్ బబ్బూరి లత చెరువు మరమ్మతు పనులను ప్రారంభించారు. కట్ట ఇరువైపులా ముళ్లచెట్ల తొలగింపు, మత్తడి లీకేజీ మరమ్మతులు తదితర పనులు చేపట్టనున్నట్లు ఇరిగేషన్ ఏఈ గురుప్రసాద్ తెలిపారు.

గ్రామీణ వైద్యులను రక్షించాలి

హుస్నాబాద్: నియోజకవర్గంలోని ఆర్‌ఎంపీ వైద్యుల సంఘం ఆధ్వర్యంలో గ్రామీణ వైద్యులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మంగళవారం క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే సతీశ్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. రాష్ట్రం వచ్చిన తర్వాత ప్రభుత్వం ఇచ్చిన 428 జీవో ప్రకారం ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఏడాది పాటు శిక్షణ తీసుకున్నామన్నారు. హుస్నాబాద్ నియోజకవర్గ వ్యాప్తంగా 550 మంది ఆర్‌ఎంపీలు సేవలు అందిస్తున్నారని, వైద్యులకు ఇచ్చిన హామీ ప్రకారం ప్రభుత్వం కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో వివిధ మండలాల గ్రామీణ వైద్యుల సంఘం అధ్యక్షులు శ్రీనివాస్, రామచంద్రం, వెంకటేశం, దేవేందర్‌రెడ్డి, సత్యనారాయణ, తిరుపతి పాల్గొన్నారు.

రైతులను ఆదుకుంటాం
హుస్నాబాద్ ఎమ్మెల్యే సతీశ్‌కుమార్


మామిడితోటను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

అక్కన్నపేట(హుస్నాబాద్): అక్కన్నపేట మండలంలో మంగళవారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురిసింది. దీంతో వరి, మామిడి తోటల రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్ మండలంలోని గోవర్ధనగిరి గ్రామంలో పర్యటించి నేలపాలైన మామిడి తోటలో కాయలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. అకాల వర్షంతో దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారం వచ్చేలా కృషి చేస్తానన్నారు. ప్రతి రైతును ఆదుకుంటామన్నారు. అదేవిధంగా చాపగానీతండా గ్రామానికి చెందిన గుగులోతు తులసి అనే మహిళ రైతు వరిపంట పూర్తిగా దెబ్బతింది. సుమారుగా 5ఎకరాల్లో సాగు చేసిన పంట నేలపాలు కావడంతో కన్నీటిపర్యంతమయ్యారు. కార్యక్రమంలో ఎంపీపీ లక్ష్మి, జెడ్పీటీసీ సభ్యురాలు మంగ, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు సాంబరాజు, నాయకులు ఉన్నారు.

పట్టుదలతో చదివి ఉన్నత స్థాయికి చేరాలి

చిన్నకోడూరు(సిద్దిపేట): విద్యార్థులు పట్టుదలతో చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలని సర్పంచ్ జయవర్ధన్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని సికింద్లాపూర్ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశం ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల నృత్యాలు పలువురిని ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ బడుల్లో మేధావులైన ఉపాధ్యాయులు ఉంటారన్నారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్‌ఎం రవీంద్రకుమార్, హెచ్‌ఎం బాల్‌లింగం, సీఆర్పీ తిరుపతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చిరుధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం

అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ పక్షోత్సవాలు


వర్గల్(గజ్వేల్): ప్రతిజ్ఞ చేస్తున్న జెడ్పీటీసీ బాలమల్లు, ఎంపీపీ లత తదితరులు


దుబ్బాక: మాట్లాడుతున్న ఎంపీపీ అనిత

దుబ్బాక: పోషక విలువలున్న చిరుధాన్యాలను ఆహారంలో భాగం చేసుకోవడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యంతో జీవించవచ్చని రాయపోల్ ఎంపీపీ కల్లూరి అనిత శ్రీనివాస్ అన్నారు. మంగళవారం రాయపోల్ మండల పరిధిలోని కొత్తపల్లి గ్రామంలో గల అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ పక్షోత్సవాల్లో భాగంగా చిరుధాన్యాలు, పోషక పదార్థాలపై గర్భిణులకు, బాలింతలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న పోషకాహారాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ రంగమ్మ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాణి, పంచాయతీ కార్యదర్శి పరమేశ్, అంగన్‌వాడీ టీచర్లు తదితరులున్నారు.

చిన్నకోడూరు(సిద్దిపేట): రోజు తీసుకునే ఆహారంలో చిరుధాన్యాలు కలిపి తీసుకోవడంతో గర్భిణులు, బాలింతలు, చిన్నారులు సంపూర్ణ ఆరోగ్యాన్ని కలిగి ఉంటారని సర్పంచ్ చంద్రకళరవి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని చంద్లాపూర్ అంగన్‌వాడీ కేంద్రంలో పోషకాహారం, చిరుధాన్యాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ దుర్గారెడ్డి, ఉపసర్పంచ్ వెంకట్‌రెడ్డి, ఏఎన్‌ఎం తిరుమల, అంగన్‌వాడీ టీచర్లు జలజ, అరుణ, శాంత తదితరులు ఉన్నారు.

అక్కన్నపేట(హుస్నాబాద్): అక్కన్నపేట మండలం పంతుల్‌తండా గ్రామంలో గల అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం చిరుధాన్యాలను ప్రదర్శించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ అశ్వినిహేము, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ రేణుక, సుజాత, పంచాయతీ కార్యదర్శి సతీష్, అంగన్‌వాడీ టీచర్ జ్యోతి, ఆశకార్యకర్త శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో రక్తహీనతకు చెక్

బెజ్జంకి(సిద్దిపేట): రక్తహీనతను నివారించేందుకు ప్రతి ఒక్కరూ పౌష్టికాహారాన్ని తీసుకోవాలని సీడీపీఓ జయమ్మ సూచించారు. బెజ్జంకి అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం పౌష్టికాహారం, చిరుధాన్యాల ప్రాముఖ్యతపై అవగాహన సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో పోషణ్ అభియాన్ బ్లాక్ కోఆర్డినేటర్ కిరణ్, సూపర్‌వైజర్ నాగరాణి, అంగన్‌వాడీ టీచర్లు జయలక్ష్మి, కనుకలక్ష్మి, సుజాత, భూదేవి, కవిత, జమున పాల్గొన్నారు.


చిన్నకోడూరు(సిద్దిపేట): అవగాహన కల్పిస్తున్న సర్పంచ్ చంద్రకళ

అంధత్వ నివారణే లక్ష్యం

హుస్నాబాద్: అంధత్వ నివారణే లక్ష్యంగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత అన్నారు. పట్టణంలోని 20వ వార్డులో మంగళవారం కంటివెలుగు శిబిరాన్ని ఆమె సందర్శించారు. కంటి సమస్యలున్నవారు ఏ మాత్రం నిర్లక్ష్యం చేయకుండా పరీక్షలు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ వాల సుప్రజ, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

హుస్నాబాద్‌రూరల్: మండలంలోని పందిల్ల గ్రామంలో కంటి వెలుగు శిబిరాన్ని జెడ్పీ వైస్ చైర్మన్ రాయిరెడ్డి రాజిరెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ తోడేటి రమేశ్, ఎంపీటీసీ జయలక్ష్మి, ఎంపీడీఓ కుమారస్వామి, కార్యదర్శి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని తోటపల్లిలో నిర్వహిస్తున్న కంటి వెలుగు శిబిరాన్ని మంగళవారం ఏపీడీ ఓబులేశ్ పరిశీలించారు. కేంద్రాల నిర్వహణ తీరును అభినందించారు. అనంతరం సర్పంచ్ నర్సింగారావు సహకారంతో అందించిన స్టీల్ ప్లేట్స్, వాటర్ బాటిళ్లను వైద్య సిబ్బందికి అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రాము, సర్పంచ్ నర్సింగారావు, నాయకులు సతీశ్, కంటి వెలుగు సభ్యులు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశవర్కర్లు పాల్గొన్నారు.


హుస్నాబాద్: శిబిరాన్ని పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ రజిత

రాహుల్‌పై కక్షసాధింపు సరికాదు

గజ్వేల్‌లో సత్యాగ్రహ దీక్ష

గజ్వేల్‌రూరల్: కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్‌పై అనర్హత వేటు వేయడాన్ని ఖండిస్తూ మంగళవారం గజ్వేల్ పట్టణంలోని ఇందిరాపార్కు చౌరస్తా వద్ద కాంగ్రెస్ నాయకులు సత్యాగ్రహ దీక్షను చేపట్టారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మాదాడి జశ్వంత్‌రెడ్డి, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు విజయ్‌కుమార్‌లు మాట్లాడుతూ.. కేంద్రంలో పాలన సాగిస్తున్న మోదీ ప్రభుత్వం ప్రశ్నించే వారి గొంతు నొక్కే ప్రయత్నం చేస్తుందని మండిపడ్డారు. దేశంలో జరుగుతున్న అవినీతిపై ప్రశ్నించిన కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌పై కక్ష్యసాధింపు చర్యలకు పాల్పడుతుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు బాలకృష్ణారెడ్డితో పాటు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఓర్వలేకే కుట్రలు

మద్దూరు(హుస్నాబాద్): రాహుల్ గాంధీ లోకసభ సభ్యత్వాన్ని రద్దు చేయడాన్ని నిరసిస్తూ మాజీ టీపీసీసీ అధ్యక్షుడు మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య ఆధ్వర్యంలో జనగామ జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సత్యాగ్రహ దీక్షలో మద్దూరు మండల జెడ్పీటీసీ గిరి కొండల్‌రెడ్డి మంగళవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడోయాత్ర విజయవంతం కావడంతో ప్రధాని మోదీ ఓర్వలేక సభ్యత్వాన్ని రద్దు చేసినట్లు తెలిపారు. రానున్న రోజుల్లో కేంద్ర, రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రాబోతోందని జోస్యం చెప్పారు.


సత్యాగ్రహ దీక్షలో కాంగ్రెస్ నాయకులు

సంతోషీమాత ఆలయ హుండీ లెక్కింపు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): పట్టణంలోని ప్రముఖ సంతోషీమాత ఆలయంలోని హుండీలను మంగళవారం శరభేశ్వర ఆలయ ఈవో రవికుమార్, సంతోషీమాత ఆలయ ఈవో విశ్వనాథ్‌శర్మల ఆధ్వర్యంలో మంగళవారం లెక్కించారు. 12 నవంబర్ 2022 నుంచి 28 మార్చి 2023 వరకు 198 రోజులకు హుండీల ఆదాయం రూ.2,46,399గా అధికారులు ప్రకటించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ మాంకాల నవీన్‌కుమార్, ధర్మకర్తల మండలి గాదగోని సత్యంగౌడ్, కొమురవెల్లి కల్యాణి, ఎక్స్ అఫీషియో సభ్యులు శాకం మధుసూదన్ శర్మ, ఆలయ అర్చకులు రామకృష్ణ, సిబ్బంది శంకర్, సంతోషీమాత సేవా సమితి సభ్యులు, మాత మండలి సభ్యులు, సిబ్బంది వాసు, సహ అర్చకులు కృష్ణమాచారి, సాయి, పాండే పాల్గొన్నారు.


హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న సిబ్బంది

విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ


ఉపాధ్యాయులతో విద్యార్థులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): పట్టణంలోని ప్రభుత్వ ప్రాథమిక (నంబర్-1) పాఠశాలలో మంగళవారం ఘనంగా స్వయంపాలన దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయులై తోటి విద్యార్థులకు పాఠాలను బోధించారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు.

కవి, గాయకుడికి సన్మానం


కవి కల్యాణ చక్రవర్తిని సన్మానిస్తున్న గ్రామస్తులు

ములుగు(గజ్వేల్): మండలంలోని క్షీరసాగర్ గ్రామంలో ఈ నెల 30న నిర్వహించనున్న సీతారాముల కల్యాణోత్సవ కార్యక్రమ ఘట్టాన్ని, సంగీతాన్ని సమకూర్చి పాటగా రచించి, గానం చేసిన కవి, గాయకుడు శ్రీ అమరవాది కల్యాణ చక్రవర్తిని గ్రామ ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు మంగళవారం ఘనంగా సత్కరించారు. సీతారాముల భక్తి పాటలు అందరికీ అందుబాటులో ఉండే విధంగా యూట్యూబ్ మాధ్యమంగా అందించినందుకు ఎంపీటీసీ కొన్యాల మమతబాల్‌రెడ్డి, సర్పంచ్ యాదమ్మనర్సింగరావులు చక్రవర్తికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు తారక సురేశ్, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

రెడ్డి జేఏసీ కార్యవర్గం ఎన్నిక

కొండపాక(గజ్వేల్): రెడ్డి జేఏసీ గజ్వేల్ నియోజకవర్గ ఉపాధ్యక్షుడిగా మండల పరిధిలోని బందారంకు చెందిన పాలడుగు బాల్‌రెడ్డి, మండల అధ్యక్షుడిగా వెలికట్టకు చెందిన దేశిరెడ్డి రాంచంద్రారెడ్డిలు మంగళవారం ఎన్నికయ్యారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశానికి హాజరైన రెడ్డి జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు రాంరెడ్డి మాట్లాడుతూ.. ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టిన రెడ్డి కార్పొరేషన్‌ను సీఎం కేసీఆర్ అమలు చేయాలన్నారు. ఏప్రిల్ 11న చేపట్టే దీక్షను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు మల్లికార్జున్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి విష్ణువర్ధన్‌రెడ్డి, ఉపాధ్యక్షులు లక్ష్మారెడ్డి, సభ్యులు మహేందర్‌రెడ్డి, ప్రణవీరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బస్టాండ్ నిర్మాణ పనుల పరిశీలన


ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎఫ్‌డీసీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్‌రూరల్: గజ్వేల్ మున్సిపాలిటీ పరిధిలోని ప్రజ్ఞాపూర్ చౌరస్తా వద్ద చేపట్టనున్న బస్టాండ్ నిర్మించే స్థలాన్ని మంగళవారం ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ.. బస్టాండ్ నిర్మాణంతో ఎన్నో ఏళ్లుగా ప్రజలు, ప్రయాణికులు ఎదుర్కొంటున్న సమస్యకు పరిష్కారం లభిస్తుందన్నారు. ఈ సందర్భంగా బస్టాండ్ నిర్మాణానికి మంత్రి హరీశ్‌రావు బుధవారం భూమిపూజ చేయనున్న క్రమంలో ఏర్పాట్లను ప్రతాప్‌రెడ్డి పరిశీలించారు. కార్యక్రమంలో ఆత్మ కమిటీ చైర్మన్ ఊడెం కృష్ణారెడ్డి, నాయకులు, ఆర్టీసీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో స్వయంపాలన


స్వయంపాలనలో చిన్నారులు

గజ్వేల్‌రూరల్: మండల పరిధిలోని కోమటిబండ గ్రామంలో గల అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం చిన్నారులు స్వయంపాలన దినోత్సవాన్ని జరుపుకొని ఉత్సాహంగా గడిపారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రానికి వచ్చిన చిన్నారులతో అంగన్‌వాడీ టీచర్ భవాణి, ఆయా కనకవ్వలు ఆటలు ఆడించి ఉత్సాహ పరిచారు. అదే విధంగా వివిధ రకాల పోటీలను నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ తూం శేఖర్, ఉపసర్పంచ్ ముత్యాలు, పంచాయతీ కార్యదర్శి రామకృష్ణారెడ్డి, ఎస్‌ఎంసీ చైర్మన్ బాలయ్య, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ భవాణి, ఆశవర్కర్ తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

ఆత్మీయత ఉట్టిపడాలి

నంగునూరు(సిద్దిపేట): బీఆర్‌ఎస్ పార్టీ నిర్వహించే సమ్మేళనంలో ఆత్మీయులను కలిసే అవకాశం రావడం ఎంతో సంతోషంగా ఉందని మండల అధ్యక్షుడు అనగోని లింగంగౌడ్ అన్నారు. మంగళవారం నంగునూరులో విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. పోచమ్మ ఆలయం వద్ద బుధవారం పార్టీ ఆత్మీయ సమ్మేళనం నిర్వహిస్తామన్నారు. ఈ సందర్భంగా మంత్రి హరీశ్‌రావు పెద్దవాగులో జలహారతి, పోచమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారన్నారు. అనంతరం ఏర్పాటు చేసే బహిరంగ సభలో పార్టీ ఆవిర్భావం నుంచి నేటి వరకు అండగా నిలిచిన ప్రతీ కార్యకర్తను మంత్రి హరీశ్‌రావుతో పాటు నాయకులు కలుస్తారన్నారు. సమావేశంలో మాజీ ఎంపీపీ శ్రీకాంత్‌రెడ్డి, సారయ్య, సోమిరెడ్డి, మల్లయ్య, వెంకట్‌రెడ్డి, కృష్ణారెడ్డి, మహిపాల్‌రెడ్డి, పురేందర్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, గ్రామ శాఖ అధ్యక్షులు, నాయకులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న లింగంగౌడ్, నాయకులు

సంక్షేమ పథకాలను ప్రజలకు చేర్చాలి


భాగ్యలక్ష్మివెంకటయ్య దంపతులను సన్మానిస్తున్న ప్రజాప్రతినిధులు

మిరుదొడ్డి(దుబ్బాక): మండల పరిధిలోని పలువురు లబ్ధిదారులకు మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను ఎంపీపీ గజ్జెల సాయిలు, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు తుమ్మల బాల్‌రాజు మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ పోలీస్ రాజులు, మండల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సత్యనారాయణ, దుబ్బాక ఆత్మ కమిటీ చైర్మన్ నమిలె భాస్కరాచారి, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, నాయకులు పాల్గొన్నారు. అనంతరం భూంపల్లి గ్రామ పంచాయతీకి సతత్ వికాస్ జిల్లా ఉత్తమ అవార్డు రావడంపై హర్షం వ్యక్తం చేస్తూ సర్పంచ్ బక్కి భాగ్యలక్ష్మివెంకటయ్య దంపతులను ప్రజాప్రతినిధులు ఘనంగా సన్మానించారు.

మున్సిపాలిటీ అభివృద్ధికి సహకరించాలి

దుబ్బాక మున్సిపల్ కమిషనర్ గణేశ్‌రెడ్డి

దుబ్బాకటౌన్: ఇంటి పన్నులు సకాలంలో చెల్లించి మున్సిపల్ అభివృద్ధికి సహకరించాలని దుబ్బాక మున్సిపల్ కమిషనర్ పాతూరి గణేశ్‌రెడ్డి అన్నారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న ఇంటి పన్ను బకాయిలు ఈ నెల 31లోగా చెల్లించాలన్నారు. మున్సిపాలిటీ పరిధిలో 5800 ఇళ్లకు గాను 1.77 కోట్లు ఇంటి పన్నులు వసూలు లక్ష్యం కాగా ఇప్పటి వరకు 1.15 కోట్లు వసూలు చేశామన్నారు. దీంతో నేటివరకు 70 శాతం వరకు పన్నులు వసూలు అయ్యాయని, 3 రోజుల్లో 100 శాతం వసూలు లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. సకాలంలో ఇంటి పన్నులు చెల్లించకుంటే జరిమానాలు చెల్లించాల్సి వస్తుందన్నారు. సమావేశంలో సిబ్బంది రామస్వామి, నర్సింలు, కర్ణాకర్, కవిత ఉన్నారు.


కమిషనర్ గణేశ్‌రెడ్డికి ఇంటి పన్ను చెల్లిస్తున్న లక్ష్మారెడ్డి

అర్హులకు డబుల్ ఇళ్లు అందించాలి

సిద్దిపేటరూరల్: గజ్వేల్ పట్టణంలో అర్హులందరికీ డబుల్ ఇళ్లను అందించాలని గజ్వేల్ పట్టణ డబుల్ ఇళ్ల సాధన కమిటీ కన్వీనర్ సందబోయిన ఎల్లయ్య, నాయకులు మైస రాములు డిమాండ్ చేశారు. మంగళవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించి, అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ఇళ్లకు 3,150 మంది దరఖాస్తు చేసుకుంటే 1,550 మందిని ఎంపిక చేశారని, మిగిలిన లిస్టులో అర్హులను గుర్తించి న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో నర్సింలు, అరుణ, లక్ష్మి, పద్మ, బాల్‌లక్ష్మి, రాణి, కవిత, ఫాసియా, జ్యోతి, మంజుల, శివయ్య, సంపత్ పాల్గొన్నారు.

ప్రశాంతంగా పండగలను జరుపుకుందాం

దుబ్బాకటౌన్: రంజాన్, శ్రీరామనవమి వేడుకలను ప్రజలందరూ కలిసి మెలసి శాంతియుత వాతావరణంలో జరుపుకుందామని దుబ్బాక సీఐ మున్నూరు కృష్ణ అన్నారు. పోలీస్ స్టేషన్ ఆవరణలో ఎస్ఐ బత్తుల మహేందర్ ఆధ్వర్యంలో శాంతి కమిటీ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా హిందూ, ముస్లింలు సోదరభావంతో పండగలను జరుపుకోవాలన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా మెదలాలన్నారు. ఎవరైనా గొడవలకు దారితీస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. మజీద్ కమిటీ అధ్యక్షుడు ఖలీల్, నాయకులు తదితరులు ఉన్నారు.

బహిరంగ ప్రకటన

Sd/- Y. CHANDRA RUSHI, B.Sc., LLB
Advocate
1-2-273, Opp: Court Building, Brundavan Colony,
JANGAON. Dist: Jangaon, Cell: 9848430926

సంక్షిప్త వార్తలు

◆ **టీడీపీ ఆవిర్భావ సభను విజయవంతం చేయండి**

హుస్నాబాద్: హైదరాబాద్ నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో బుధవారం నిర్వహించే టీడీపీ 41వ ఆవిర్భావ సభను విజయవంతం చేయాలని టీడీపీ దళిత విభాగం రాష్ట్ర కార్యదర్శి చింతకింది సింగరయ్య తెలిపారు. ఈ సభకు పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు, రాష్ట్ర అధ్యక్షుడు జ్ఞానేశ్వర్ హాజరవుతున్నట్లు తెలిపారు. ఈ సభకు పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని సింగరయ్య పేర్కొన్నాడు.

◆ **నేడు మండల ఆత్మీయ సమ్మేళనం**

మర్కూక్(గజ్వేల్): బీఆర్‌ఎస్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు బుధవారం మర్కూక్ మండల ఆత్మీయ సమ్మేళనం నిర్వహిస్తున్నామని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కరుణాకర్‌రెడ్డి మంగళవారం తెలిపారు. బుధవారం ఉదయం 11 గంటలకు ఎర్రవల్లి ఫంక్షన్‌హాల్‌లో సమ్మేళనం ప్రారంభమతుందని, ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీ యాదవరెడ్డి, జిల్లా ఇన్‌చార్జి వెంకటేశ్వర్లు, ఎఫ్‌డీసీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డిలతో పాటు పలువురు ముఖ్యులు హాజరవుతారని తెలిపారు. మండలంలోని 16 గ్రామాల కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలని కోరారు.

◆ **ఆత్మీయ సమ్మేళనం వాయిదా**

అక్కన్నపేట(హుస్నాబాద్): అక్కన్నపేట మండల బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనం వాయిదా పడింది. మంగళవారం మండల కేంద్రంలోని మర్రిచెట్టు కింద ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. కానీ మధ్యాహ్నం సమయంలో సుమారుగా అరగంట పాటు ఎడతెరపి లేకుండా కురిసిన వర్షం కారణంగా సమ్మేళనం వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. తిరిగి వచ్చే నెల 6వ తేదీన హుస్నాబాద్‌లో ఓ ఫంక్షన్ హాల్‌లో సమ్మేళనం నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ ప్రకటించారు.

◆ **వీడ్కోలు సమావేశం**

కొండపాక(గజ్వేల్): మండల పరిధిలోని ఖమ్మంపల్లి హైస్కూల్లో మంగళవారం 10వ తరగతి విద్యార్థులకు వీడ్కోలు, నూతనంగా 10దిలో చేరే విద్యార్థుల ఆహ్వాన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ యటెల్లి యాదవ్వ మాట్లాడుతూ.. పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు పంపేలా తల్లిదండ్రులు కృషి చేయాలన్నారు. అనంతరం 10వ తరగతి పరీక్షలు విద్యార్థులకు సామగ్రిని అందజేశారు. కార్యక్రమంలో దాత యాటెల్లి ఈశ్వర్, హెచ్‌ఎం జ్యోతి, పాధ్యాయులు పాల్గొన్నారు.

◆ **చౌడారం మత్స్యకార సొసైటీ ఎన్నిక**

చిన్నకోడూరు(సిద్దిపేట): మండల పరిధిలోని చౌడారం మత్స్యకార సంఘం సొసైటీని మంగళవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా అశోక్, ఉపాధ్యక్షుడిగా బాబు, కోశాధికారిగా శేఖర్‌లను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మాణిక్యరెడ్డి, సర్పంచ్ అనిత, ముదిరాజ్‌లు పాల్గొన్నారు.

◆ **ఆలయ భూములను రక్షించండి**

మర్కూక్(గజ్వేల్): మండలంలోని రంగనాయక స్వామి ఆలయానికి సంబంధించిన భూములు అన్యాక్రాంతం అవుతున్నాయని, ఆ భూమికి హద్దులు ఏర్పాటు చేయాలని కోరుతూ మంగళవారం బీజేపీ మండల అధ్యక్షుడు రమేశ్ తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో నాయకులు తిరుపతిరెడ్డి, ప్రవీణ్, సుధాకర్‌రెడ్డి, నరేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

◆ **పౌరహక్కుల దినోత్సవం నిర్వహించాలి**

చేర్యాల(సిద్దిపేట): మండల పరిధిలో మేజర్ గ్రామ పంచాయతీ అయిన ఆకునూరులో పౌరహక్కుల దినోత్సవం నిర్వహించాలని కోరుతూ పలువురు యువకులు మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ వేణుగోపాల్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో యువకులు వేణు, తిమ్మాయపల్లి శశిధర్, భూమని శ్రవణ్, మీనుగు హరీశ్ తదితరులు పాల్గొన్నారు.

◆ **విద్యుత్ సమస్యలను పరిష్కరించాలి**

కొమురవెల్లి(సిద్దిపేట): మండలంలోని కిష్టంపేట గ్రామంలో నెలకొన్న విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని కిష్టంపేట సర్పంచ్ బీమనపల్లి కరుణాకర్ ఆధ్వర్యంలో ఏఈ కనుకయ్యకు మంగళవారం వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో వార్డుమెంబర్లు నాగిరెడ్డి, శ్రీనివాస్, నర్సింహులు, కొడిసెల రాజు తదితరులు పాల్గొన్నారు.

◆ **పేదల సంక్షేమమే లక్ష్యం**

గజ్వేల్: పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని మార్కెట్ కమిటీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్ అన్నారు. మంగళవారం మండలంలోని అహ్మదీపూర్‌లో పలువురికి మంజూరైన సీఎం సహాయ నిధి చెక్కులను పంపిణీ చేశారు.

◆ **సీసీ కెమెరాలు ప్రారంభం**

ములుగు(గజ్వేల్): ములుగు మండలం కొత్తూరు గ్రామంలో సర్పంచ్ బాలేశ్, గ్రామస్తుల సహకారంతో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను గజ్వేల్ ఏసీపీ రమేశ్ మంగళవారం ప్రారంభించారు. కార్యక్రమంలో గజ్వేల్ రూరల్ సీఐ రాజశేఖర్‌రెడ్డి, ములుగు ఎస్ఐ రంగకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

◆ **న్యూసెన్స్ కేసులో వ్యక్తికి జరిమానా, జైలుశిక్ష**

సిద్దిపేటకమాన్: పోలీస్ సిబ్బందితో దురుసుగా ప్రవర్తించిన వ్యక్తికి జరిమానాతో పాటు, జైలు శిక్షను సిద్దిపేట కోర్టు విధించింది. సిద్దిపేట టూటౌన్ సీఐ రవికుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. సిద్దిపేట కేసీఆర్‌నగర్‌కు చెందిన ఎండీ అన్వర్ రెండు రోజుల క్రితం ప్రజలు, పోలీసు సిబ్బందితో దురుసుగా ప్రవర్తించడంతో అతడిపై పోలీసులు న్యూసెన్స్ కేసు నమోదు చేశారు. మంగళవారం అతడిని కోర్టులో హాజరుపర్చగా విచారణ చేసిన జడ్జి నిందితుడికి రూ.650లు జరిమానాతో పాటు ఐదు రోజుల జైలు శిక్ష విధించినట్లు సీఐ తెలిపారు.

◆ **అటవీ అధికారులకు జింక అప్పగింత**

సిద్దిపేటరూరల్: మండల పరిధిలోని మాచాపూర్‌కు చెందిన దుంపటి బాలయ్య వ్యవసాయ బావిలో ఉదయం 11 గంటల సమయంలో అడవి జింక పడింది. దీంతో వారు వ్యవసాయ పనులు చేసుకుంటూ బావిలోని జింకను గమనించి సర్పంచ్ పంజ భాగ్యలక్ష్మికి సమాచారం అందించారు. అనంతరం దుబ్బాకకు చెందిన ఫారెస్ట్ అధికారి రామకృష్ణకు సమాచారం అందించగా అక్కడికి చేరుకున్న ఆయన అగ్నిమాపక సిబ్బంది చొరవతో జింకను బయటికి తీశారు. జింకను తీసుకెళ్లి మల్లాయపల్లి అడవిలో విడిచిపెడతామని తెలిపారు. ఈ ఘటనలో అగ్నిమాపక సిబ్బంది నితిన్, రవికుమార్, గ్రామస్తులు బాలయ్య, కర్ణాకర్‌రెడ్డి పాల్గొన్నారు.